నమస్తే తెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం

5 | ఖమ్మం, గురువారం 29 మే 2025 | BHADRADRI KOTHAGUDEM




కడసారి చూసేందుకు వేలాదిగా తరలివచ్చిన అభిమానులు, శ్రేణులు

# మదన్‌లాల్‌కు కన్నీటి వీడ్కోలు

- అశ్రునయనాల మధ్య కొనసాగిన అంతిమయాత్ర
- పాడెమోసిన ఎంపీ వద్దిరాజు, మాజీ మంత్రి అజయ్
- కడసారి చూసిఉద్వేగానికి లోనైన అభిమానులు, శ్రేణులు
- నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చిన నేతలు
- జనసంద్రంగా మారిన మదన్‌లాల్ స్వగ్రామం ఈర్లపూడి

రఘునాథపాలెం, మే 28: ఖమ్మం జిల్లా వైరా మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బానోతు మదన్‌లాల్‌కు అశ్రునయనాల మధ్య కన్నీటి వీడ్కోలు పలికారు. హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఆయనకు గుండెపోటు రావడంతో సోమవారం అర్ధరాత్రి మృతి చెందిన విషయం విదితమే. ఆయన మృతదేహాన్ని కుటుంబ సభ్యులు మంగళవారం ఖమ్మంలోని స్వగృహానికి తరలించగా పలువురు బీఆర్ఎస్ నేతలు, నాయకులు సందర్శించి నివాళులర్పించారు. బుధవారం ఉదయం మదన్‌లాల్ పార్థివదేహాన్ని డప్పుచప్పుళ్ల నడుమ స్వగ్రామమైన రఘునాథపాలెం మండలం ఈర్లపూడి గ్రామానికి తీసుకెళ్లారు. అక్కడ ప్రజల సందర్శనార్థం ఉంచగా.. వైరా నియోజకవర్గానికి చెందిన నాయకులు, అభిమానులు, బంధువులు, చుట్టుపక్కల గ్రామాలు, తండాల ప్రజలు సందర్శించి భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దీంతో ఈర్లపూడి గ్రామం జనసంద్రంగా మారింది. మధ్యాహ్నం అంత్యక్రియల నిమిత్తం పార్థివదేహాన్ని తరలిస్తుండగా కుటుంబ సభ్యులు, అభిమానులు తీవ్ర ఉద్వేగానికి లోనయ్యారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌లు మదన్‌లాల్ పాడె మోశారు. ఆ తర్వాత వైకుంఠ రథంపై పార్థివదేహాన్ని ఉంచి నిర్వహించిన అంతిమయాత్ర గ్రామ శివారు వరకు కొనసాగింది. వైకుంఠ రథం ఎక్కిన వద్దిరాజు, అజయ్ కడవరకూ సాగారు. గ్రామ శివారులోని వైకుంఠధామంలో కుటుంబ సభ్యులు మదన్‌లాల్ అంత్యక్రియలు పూర్తి చేశారు.

### కన్నీటి పర్యంతమైన అభిమానులు

మదన్‌లాల్ మరణవార్త తెలుసుకున్న అభిమానులు, బీఆర్ఎస్ శ్రేణులు కడసారి చూపు కోసం వైరా నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆయన పార్థివదేహాన్ని చూసి తీవ్ర ఉద్వేగానికి లోనయ్యారు. అందరినీ ప్రేమ, ఆప్యాయతలతో పలకరిస్తూ మాట్లాడే వ్యక్తి, మంచి గుణం ఉన్న ప్రజానేత మృతిచెందడంతో కన్నీరు పెట్టుకున్నారు. వైరా నియోజకవర్గానికి ఆయన చేసిన సేవా, అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు.

### ప్రముఖుల నివాళి





మదన్‌లాల్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న రేగా, రాకేశ్‌రెడ్డి

మదన్‌లాల్ పార్థివదేహానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, తాటి వెంకటేశ్వర్లు, బానోతు హరిప్రియ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేశ్‌రెడ్డి, భద్రాద్రి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు అజ్మీరా వీరూనాయక్, మాదంశెట్టి హరిప్రసాద్, గుత్తా రవి, మెంటెం రామారావు, పిన్ని కోటేశ్వరరావు, చెరుకూరి ప్రదీప్, కార్పొరేటర్లు కూరాకుల వలరాజు, నాగండ్ల కోటి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గోపాల్‌రెడ్డి, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు మదన్‌లాల్ పార్థివదేహానికి నివాళులర్పించారు.



మదన్‌లాల్ అంతిమయాత్రంలో పాడె మోస్తున్న అజయ్, వద్దిరాజు, చిత్రంలో రాకేశ్‌రెడ్డి

### రైతు భరోసా జమ కాలేదు..



నాకు ఐదు ఎకరాల పొలం ఉంది. గత కేసీఆర్ ప్రభుత్వంలో పంట వేయక ముందే, సీజన్ ప్రారంభంలోనే రైతు బంధు జమ అయ్యేది. కాంగ్రెస్ వచ్చాక గత వానకాలం సీజన్‌లో రాలేదు. యాసంగిలో ఐదెకరాల్లోపు వాళ్లకే ఇచ్చారు. మాకు ఇవ్వలేదు. ఎప్పుడు అడిగినా అందరికీ వస్తాయనే చెబుతున్నారు. ఇంతలో యాసంగి పోయింది. వానకాలం వచ్చింది.

–ఆళ్ల శ్రీను, రైతు, తుంగారం, చండ్రుగొండ

### సాయంపై నమ్మకం లేదు..



రైతుభరోసా పంటల సాయం అందుతుందన్న నమ్మకం లేదు. నాకైతే ఆ విశ్వాసం ఎప్పుడో పోయింది. ఇప్పటిదాకా వ్యవసాయ శాఖ ఆఫీసుల చుట్టూ తిరిగి అలిసిపోయాను. ఎప్పుడెళ్లి అడిగినా అందరికీ వస్తాయన్న సమాధానమే చెబుతున్నారు. కానీ రాలేదు. బ్యాంకులో అడిగితే మీకే మెసేజ్ వస్తుందని చెబుతున్నారు. మెసేజ్ రాలేదు. సాయం జమ కాలేదు.

–అట్ల శ్రీను, రైతు, రేపల్లెవాడ, చండ్రుగొండ

### ఇంకా జమ కావాల్సిన మొత్తం రూ.132 కోట్లు..

భద్రాద్రి జిల్లాలో 1,75,770 మంది రైతులు పట్టాదారు పాసుపుస్తకాలు కలిగి ఉన్నారు. వీరికి రూ.294 కోట్లు జమ చేయాల్సి ఉంది. వీరిలో ఐదు ఎకరాల్లోపు విస్తీర్ణం ఉన్న 1,37,718 మందికి మాత్రమే రూ.162 కోట్లను ఇప్పటి వరకూ జమ చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఐదెకరాలకు పైబడిన విస్తీర్ణం ఉన్న 38,052 మంది రైతులకు ఇంకా రూ.132 కోట్లు జమ కావాల్సి ఉంది.

- ఐదు ఎకరాలు పైబడిన రైతులకు ఇప్పటికీ అందని 'రైతుభరోసా'
- ఐదు నెలలు సాగదీసి ఐదెకరాల్లోపు రైతులకే 'పంటల సాయం'
- తాజాగా మళ్లీ అదును మీదకు వచ్చిన 'వానకాలం' సీజన్
- యాసంగి సాయం ఇవ్వకపోవడంపై భగ్గుమంటున్న రైతులు
- ఈ వానకాలం సాయంపైనా నమ్మకం కోల్పోయిన కర్షకులు
- యాసంగిలో 'భద్రాద్రి'లో ఇంకా 38,052 రైతులకు పెండింగ్
- 1,75,770 మంది రైతుల్లో 1,37,718 మందికి మాత్రమే జమ
- మొత్తం రూ.294 కోట్లకు గాను రూ.162 కోట్ల సాయమే చెల్లింపు
- ఇంకా అన్నదాతలకు అందాల్సిన పంటల పెట్టుబడి రూ.132 కోట్లు
- ఎప్పటికప్పుడు 'ఇస్తాం' అనే మాటలు చెబుతూ 'కాలం' వెళ్లదీత



# 'భరోసా' లేదు.. నయవంచనే..

## (యాసంగి పోయింది.. వానకాలం వచ్చింది.. రైతు భరోసా మాత్రం రాలేదు)

'రైతుబంధు కింద బీఆర్ఎస్ ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేలు మాత్రమే ఇస్తోంది. కానీ.. మేం అధికారంలోకి రాగానే రైతుభరోసా పేరిట ఎకరానికి రూ.15 వేలు ఇస్తాం.' అంటూ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఆర్భాటంగా హామీ ఇచ్చిన కాంగ్రెస్.. తీరా గెలిచాక ఒట్టును తీసి గట్టుమీద పెట్టింది. సీజన్లు సాగదీస్తూ, కాలాలు వెళ్లదీస్తూ హలధారులను అరిగోస పెట్టించింది. నమ్మబలికి నయవంచనకు గురిచేసింది. దీంతో సీజన్లు దాటిపోతున్నా సాయం అందకపోవడంతో అన్నదాతలను ఆర్థిక కష్టాలు చుట్టుముడుతున్నాయి. మళ్లీ అప్పులు చేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఎప్పటికప్పుడు 'ఇస్తాం' అనే మాటలు చెబుతూ 'కాలాలు' వెళ్లదీస్తోంది తప్ప.. సీజన్‌కు ముందుగా సాయం అందించిన పాపాన పోలేదు. భద్రాద్రి జిల్లాలో ఐదు ఎకరాలు పైబడిన రైతులకు ఇప్పటికీ 'రైతు భరోసా'ను జమ చేయలేదు. జనవరిలో మొదలుపెట్టిన యాసంగి సీజన్ పంటల పెట్టుబడి సాయం జమను ఐదు నెలలపాటు సాగదీసింది. అదికూడా ఐదెకరాల్లోపు రైతులకే అందించింది. ఆపైన విస్తీర్ణం ఉన్న రైతులకు నేటికీ పెండింగ్ పెట్టింది.

–భద్రాద్రి కొత్తగూడెం, మే 28 (నమస్తే తెలంగాణ







వానకాలం పంట కోసం దుక్కులు దున్నతున్న రైతు

'మేమొస్తే ఎకరానికి రూ.15 వేలు ఇస్తాం.' అనే హామీని కూడా తుంగలో తొక్కింది కాంగ్రెస్ ప్రభుత్వం. సుమారు ఏడాదికిపైగా కాలం గడిపి.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఎకరానికి రూ.12 వేల చొప్పునే చెల్లించాలని నిర్ణయించాం' అంటూ ప్రకటించింది. అంటే వానకాలం సీజన్‌కు రూ.6 వేలు, యాసంగి సీజన్‌కు మరో రూ.6 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. కానీ.. ఈ ఏడాది వానకాలం సీజన్ పనులు మొదలవుతున్నప్పటికీ ఐదెకరాలు పైబడిన రైతులకు గత యాసంగి సీజన్‌లో జమ చేయాల్సిన రైతుభరోసాను ఇప్పటికీ జమ చేయలేదు. దీంతో గత యాసంగి సీజన్‌లో అప్పులు తెచ్చుకొని పంటలు సాగు చేసుకున్న రైతులు.. వాటిని తీర్చుకోలేక పోగా.. ఇప్పుడు వానకాలం సీజన్ కోసం మళ్లీ అప్పుల కోసం పరుగులు పెట్టాల్సిన దయనీయ పరిస్థితి ఎదురవుతోంది.

### వానకాలం అంచనాలు సిద్ధం..

రైతుభరోసా అందక అన్నదాతలు ఆర్థికంగా సతమతమవుతున్నప్పటికీ.. వానకాలం సీజన్ మాత్రం రానే వచ్చింది. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు కూడా ఈ సీజన్‌కు ముందస్తు పంటల అంచనాలను సిద్ధం చేశారు. జిల్లాలో 4.71 లక్షల ఎకరాల్లో పంటలను వేయనున్నట్లు అంచనా వేశారు. ఇందులో వరి 1,65,485 ఎకరాలు, పత్తి 2,04,583 ఎకరాలు, మిర్చి 10,333 ఎకరాలు, జొన్న 85,527 ఎకరాలతోపాటు ఇతర పంటలను మరికొన్ని ఎకరాల్లో రైతులు సాగు చేయనున్నట్లు అంచనాలు సిద్ధం చేశారు. ఈసారి భారీ వర్షాలు కురుస్తుండడం, కాలం ముందుగానే అయ్యే పరిస్థితి కన్పిస్తుండడంతో తమకు ఈ సీజన్ కలిసొస్తుందనే ఆశతో అన్నదాతలు ఉన్నారు. కానీ.. కాంగ్రెస్ సర్కారు మాత్రం వారికి సకాలంలో పంటల పెట్టుబడి సాయాన్ని అందించకపోవడం వారికి గుదిబండగా మారుతోంది.

### యాసంగి ధాన్యం కొనుగోళ్లలోనూ జాప్యం..

భద్రాద్రి జిల్లాలో యాసంగి పంట వేసిన రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చుక్కలు చూపించింది. తేమ పేరుతో ధాన్యం రాసులను కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లోనే ఉంచడంతో అకాల వర్షాలకు అవి తడిసిపోయాయి. ఫలితంగా అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే రైతుల వద్ద ధాన్యం ఉండడం గమనార్హం. జిల్లాలో 144 కొనుగోలు కేందాల్లో 39,072 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. కేవలం 5,685 మంది రైతులు మాత్రమే కొనుగోలు కేంద్రాల్లో విక్రయించారు. వారికి ఇప్పటివరకు రూ.90 కోట్లను చెల్లించింది. ప్రభుత్వం పెట్టిన కఠిన నిబంధనల కారణంగా చాలామంది రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించుకున్నారు.



యాసంగి పంటను సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో వానకు తడిసిన ధాన్యం రాసులు

### కటాఫ్ తేదీ ఏమీ లేదు..



ప్రభుత్వం నుంచి మాకు ఎలాంటి ఆదేశాలూ రాలేదు. అందరికీ ఇస్తామని ప్రభుత్వం చెబుతోంది. అప్పటి నుంచి ప్రతీ రోజూ కొంతమందికి రైతుభరోసా జమ అవుతోంది. జిల్లాలో ఎంతమందికి సాయం జమ అయిందో అనే సమాచారం మాకు ఎప్పటికప్పుడు వస్తుంది. రైతుభరోసా జమ కోసం కటాఫ్ తేదీ అంటూ ఏమీ లేదు. ఇక వానకాలం పంటలకూ అంచనాలు సిద్ధం చేశాం.

–వేల్పుల బాబూరావు, డీఏవో, భద్రాద్రి

### ఆటోడ్రైవర్ల ఆత్మహత్యలకు

# కాంగ్రెస్ ప్రభుత్వానిదే బాధ్యత

- ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ
- ఆత్మహత్య చేసుకున్న ఆటోడ్రైవర్‌కు నివాళి
- మృతదేహంతో ఆటో యూనియన్ నేతల ర్యాలీ



ఆటోడ్రైవర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందు, మే 28: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి ఆటోడ్రైవర్ల ఆత్మహత్యలు ప్రారంభమయ్యాయని, వారి మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ అన్నారు. ఇల్లెందు 15వ నెంబర్ బస్తీ 13వ వార్డుకు చెందిన దుర్గాప్రసాద్ పాసి అనే ఆటోడ్రైవర్ ఆర్థిక ఇబ్బందులు తాళలేక మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. దుర్గాప్రసాద్ ఇల్లెందు జగదాంబ సెంటర్ ఆటో అడ్డాకు చెందిన ఆటోడ్రైవర్. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియనాయక్ బుధవారం దుర్గాప్రసాద్ ఇంటికెళ్లి అతడి మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటానని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు పథకం పెట్టి ఆటో కార్మికులను మర్చిపోవడం సరికాదని, ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండో సంవత్సరం కూడా పూర్తి కావస్తున్నప్పటికీ అతీగతీలేదన్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. 13వ వార్డు నాయకులు కడగంచి వీరస్వామి, రామ్‌లాల్ పాసి, టీపీడీయూ నేతలు సముద్రాల తిరుమల, మద్ది మల్లేశ్, చందు, అశోక్, నవాబ్, యాకుబ్, శివ, సందీప్, మేకల శీను, సలీం పాషా, రాజేశ్ పాల్గొన్నారు.



ఇల్లెందులో ర్యాలీ చేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

### మృతదేహంతో ఆటో యూనియన్ ర్యాలీ..

రాష్ట్రంలో ఉచిత బస్సు పథకం వల్ల ఆటోలు సరిగా సాగక ఆటోడ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అందుకే దుర్గాప్రసాద్ పాసి మృతిచెందాడని ఆటో యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తంచేశారు. ఆటో యూనియన్ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి దుర్గాప్రసాద్ మృతదేహంతో ఇల్లెందు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి జగదాంబ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

# 830 కిలోల గంజాయి పట్టివేత

**వివరాలు వెల్లడించిన భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ బిరుదురాజు రోహిత్‌రాజు**



పట్టుబడిన గంజాయి, నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

జూలూరుపాడు, మే 28: వాహన తనిఖీల్లో భాగంగా పోలీసులు 830 కిలోల గంజాయిని చాకచక్యంగా పట్టుకున్నట్లు భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు జూలూరుపాడు పోలీసులు, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా జూలూరుపాడు మండలం పడమటి నర్సాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో భాగంగా డీసీఎం వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా.. 830.540 కిలోల నిషేధిత గంజాయి లభ్యమైందని తెలిపారు. దీని విలువ సుమారు రూ.4,15,27,000 ఉంటుందని పేర్కొన్నారు. ఈ క్రమంలో వ్యాన్‌లో ఉన్న మధ్యప్రదేశ్ రాష్ట్రం బెండ్ జిల్లా హాతర్కరి గ్రామానికి చెందిన జస్రం, అదే జిల్లా బర్రై గ్రామానికి చెందిన రాంకుమార్‌లను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టినట్లు తెలిపారు. వ్యాన్ వెనుక భాగంలో అనుమానం రాకుండా ఒక ప్రత్యేక అర తయారు చేసి అందులో గంజాయి ప్యాకెట్లను పెట్టి అక్రమ రవాణా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏపీ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిధి తులసీపాక గ్రామం నుంచి గంజాయి లోడ్ చేసుకొని భద్రాచలం, కొత్తగూడెం, ఖమ్మం మీదుగా ఢిల్లీకి తరలిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. నిషేధిత గంజాయిని అమ్మిన, కొనుగోలు చేసిన, రవాణా చేస్తున్న వ్యక్తులు తొమ్మిది మందిపై కేసు నమోదు చేసి, రవాణాకు ఉపయోగించిన వ్యాన్, రెండు మొబైల్ ఫోన్లు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఏడుగురు నిందితులు పరారీలో ఉండగా.. పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు తెలిపారు. గంజాయి తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్న జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై రవి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రమాకాంత్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్సైలు ప్రవీణ్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో.. కలెక్టర్ సతీమణి ప్రసవం

**మగ బిడ్డకు జన్మనిచ్చిన భద్రాద్రి కలెక్టర్ పాటిల్ భార్య శ్రద్ధ**



తన శిశువుతో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్



కలెక్టర్ సతీమణికి కాన్పు చేసిన పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు

పాల్వంచ, మే 28: భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సతీమణి శ్రద్ధ పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం మగబిడ్డకు జన్మనిచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందించే వైద్యంపై ప్రజలకు నమ్మకం కలిగించాలనే ఉద్దేశంతో కలెక్టర్.. తన సతీమణి గర్భం దాల్చినప్పటి నుంచి పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించడంతోపాటు వైద్యుల సూచన మేరకు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ క్రమంలో కలెక్టర్ భార్యకు తొమ్మిది నెలలు నిండడంతో ప్రసవం కోసం ఆసుపత్రికి తీసుకొచ్చారు. జిల్లా వైద్య సమన్వయ అధికారి రవిబాబు, పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంప్రసాద్, సర్జన్ సోమరాజు దొర, అనస్తీసియా డాక్టర్ ప్రసాద్ సమక్షంలో నర్సింగ్ ఆఫీసర్ స్వర్ణలత, గైనకాలజిస్టు సరళ, అనూషలు సిజేరియన్ చేయడంతో ఆమె మగబిడ్డకు జన్మనిచ్చారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది కలెక్టర్‌కు స్వీట్లు తినిపించారు.

# కొండరెడ్ల జీవనోపాధికి శిక్షణ: పీవో



కొండరెడ్లకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

అశ్వారావుపేట రూరల్, మే 28: కొండరెడ్ల యువతీ యువకులకు జీవనోపాధి పెంపొందించేందుకు ప్రభుత్వం వివిధ అంశాల్లో అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, వారు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఆకాంక్షించారు. గవర్నర్ దత్తత తీసుకున్న గోగులపూడి గ్రామంలో కొండరెడ్ల యువతీ యువకులు వెదురుతో తయారు చేసిన వివిధ కళాకృతుల కేంద్రాన్ని బుధవారం పీవో సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐటీడీఏ ద్వారా వెదురుతో తయారు చేసిన వివిధ కళాకృతులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని, కొనుగోలుదారుల అభిరుచిని బట్టి నూతన డిజైన్లు రూపొందించి వ్యాపారాన్ని విస్తరించుకోవాలని సూచించారు. అలాగే అగర్‌బత్తీలు తయారు చేసి ఉపాధి పొందాలన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు తేనెటీగల పెంపకం, సెల్ ఫోన్, సోలార్ ప్యానల్ మరమ్మతు కోసం స్వయం ఉపాధికి సంబంధించిన శిక్షణ ఐటీడీఏ ద్వారా అందిస్తామని తెలిపారు. 26 మందికి పోడు పట్టాలు ఉన్నందున మూడెకరాలు ఒక యూనిట్‌గా చేసి ఇందిర సౌర జలవికాస పథకం ద్వారా బోరు బావులు తవ్వించి పామాయిల్, మునగ సాగులో అంతర పంటలు పండించే విధంగా ప్రభుత్వం వీలు కల్పించిందన్నారు. అనంతరం గవర్నర్ దత్తత తీసుకున్న గ్రామాల యువకులకు రూ.5 లక్షల విలువైన టెంట్‌హౌస్, మైక్ సెట్ పంపిణీ చేశారు. వెదురు, అగర్‌బత్తీల తయారీలో శిక్షణ పొందిన యువతీ యువకులకు సర్టిఫికెట్లు అందజేశారు. తర్వాత గుబ్బలమంగమ్మ తల్లి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. తిరుమలకుంటలో తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థపై ఫిర్యాదు చేయగా.. ఏఈ ప్రతిపాదనలు రూపొందించి అందజేస్తే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, జేడీఎం హరికృష్ణ, ఐటీడీఏ డీఈఈ బాపనయ్య, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో సీతారామరాజు, హౌసింగ్ ఏఈ మదన్ పాల్గొన్నారు.